క్లుప్తంగా

నేడు మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం

దౌల్తాబాద్: మండల మహిళా సమాఖ్య 23వ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం సాయన్న ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రతి మహిళ సంఘం నుంచి కనీసం ఇద్దరు సభ్యులు హాజరవ్వాలని సూచించారు. ఈ సమావేశం స్థానిక మహిళ సమాఖ్య కార్యాలయంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంబయ్యగౌడ్

కొడంగల్ రూరల్: పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ సూచించారు. శుక్రవారం నీటూర్ గేటు సమీపంలోని పత్తి మిల్లులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521, రెండో రకం రూ.7,421 చెల్లిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతుకుమార్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



బాణాపూర్‌లో బిగిస్తున్న హైమాస్ట్ లైట్లు

యాలాల: మండల పరిధిలోని బాణాపూర్ గ్రామంలో శుక్రవారం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి కోటా నుంచి గతంలో హైమాస్ట్ లైట్లు విడుదలయ్యాయి. అనంతరం ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. తాజాగా స్థానిక బీఆర్ఎస్ నాయకుడు రవినాయక్ ఆధ్వర్యంలో లైట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలో మూడు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఒక్కో హైమాస్ట్ లైట్ విలువ సుమారు రూ.1.70 లక్షల వరకు ఉంటుందన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



మహేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న సుభాష్

మోమిన్‌పేట: మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో యువజన కాంగ్రెస్ మండల నాయకుడు సుభాష్ ఆధ్వర్యంలో కలిశారు. నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడంతో శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించారు. మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు జోరుగా కొనసాగుతున్నాయి. వారం రోజులుగా గ్రామంలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పంచాయతీ కార్మికులు తొలగిస్తున్నారు. మురుగు, వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండడంతో తొలగిస్తున్నట్లు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

శిలాఫలకం సరే.. పనులేవి?

- గత ప్రభుత్వంలోనే శంకుస్థాపన చేసిన వైనం
- అవస్థలు పడుతున్న నాగసమందర్‌వాసులు
- ఫార్మేషన్ రోడ్డును నిర్మించాలని రైతుల విజ్ఞప్తి



కల్వర్టు లేక రోడ్డుపై కాలువ నీరు

ధారూరు: ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం చేపట్టే పనుల్లో నిబద్ధత ఉండాలి. అప్పుడే దాని ఫలితాలు సకాలంలో ప్రజలకు చేరుతాయి. మండల పరిధిలో నాగసమందర్‌లో గత ప్రభుత్వ హయాంలో 2020లో ఫార్మేషన్ రోడ్డుకు శంకుస్థాపన చేసి వదిలేశారు. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అప్పట్లో జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ నుంచి రోడ్డుకు 35 శాతం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. హడావుడిగా శిలాఫలకం సైతం నాటారు. అయినా రొక్కం విడుదల కాకపోవడంతో రోడ్డు పనులు పడకేశాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా అధికారులను రోడ్డు విషయమై అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. మండల పరిధిలోని నాగసమందర్ ఎస్సీ కాలనీ నుంచి పొలాల గుండా కోట్‌పల్లి మండల కేంద్రానికి వెళ్లడానికి ఫార్మేషన్ రోడ్డు అనాది నుంచి ఉంది. ఈ రోడ్డు వర్షా కాలంలో బురదమయం కావడంతో ఇక్కట్లు తప్పడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు.

కోట్‌పల్లికి మార్గం సులువు

ప్రస్తుతం తరచూ కురుస్తున్న వర్షాలకు ఫార్మేషన్ రోడ్డు బురదమయంగా తయారయింది. ట్రాక్టర్లు వెళితే బురదలో కూరుకుపోయి బయటకు రావడం లేదు. పాదచారులు, పశువులు ఈ దారిలో వెళ్లడానికి వీలు కావడం లేదని తెలిపారు. పశువులను తీసుకెళ్లి వ్యవసాయ పనులు చేసుకునేందుకు సైతం వీలు కాని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. రోడ్డు ద్వారా కోట్‌పల్లి మండల కేంద్రానికి వెళ్లడానికి సులువవుతోంది. ఈ ఫార్మేషన్ రోడ్డు మధ్యలో రెండు కాలువల్లో నీరు నిరంతరంగా ప్రవహిస్తుంది. వీటిపై కల్వర్టులు సైతం నిర్మించాల్సి ఉంది. తామే స్వయంగా డబ్బులు సమకూర్చుకుని కల్వర్టు నిర్మించాలని భావించిన వీలు కాలేదని తెలిపారు. శాసనసభ స్పీకర్ చొరవ తీసుకుని ఫార్మేషన్ రోడ్డు, రెండు కల్వర్టులకు నిధులు మంజూరు చేయించి ఇక్కట్లు తీర్చాలని శుక్రవారం రైతులు రంగని మల్లప్ప, దమ్మగళ్ల బందెప్ప, దుబ్బ చంద్రప్ప, ఎన్కెపల్లి ఏసప్ప, మ్యాదరి యాదప్ప, కమలాపురం జయప్ప తదితరులు విజ్ఞప్తి చేశారు.



ఫార్మేషన్ రోడ్డు దుస్థితి



ఫార్మేషన్ రోడ్డు కోసం వేసిన శిలాఫలకం

మహాసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుల్కచర్ల: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 29న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 29వ తేదీన నగరంలో నిర్వహించే ధర్మయుద్ధం మహాసభకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ రానున్నారని, మండల పరిధిలోని దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్రాములు, చుక్కయ్య, వెంకటయ్య, బాబు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షలను వినియోగించుకోండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్: వచ్చే నెల 7వ తేదీన జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొనాలని జెడ్పీహెచ్ఎస్ బాలుర హెచ్ఎం మురళీ కోరారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో చెకుముకి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతిభా పరీక్షల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో 7వ తేదీన, మండల స్థాయిలో 21వ తేదీన, జిల్లా స్థాయి పరీక్ష నవంబర్ 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

1న గ్యార్మీ పండగ

కొడంగల్ రూరల్: పట్టణంలోని మక్కా మసీద్‌లో నవంబర్ 1వ తేదీన గౌసెపాక్ గ్యార్మీ పండగ నిర్వహించనున్నట్లు మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. 1వ తేదీన శుక్రవారం నమాజ్ అనంతరం జమే మసీద్ నుంచి మహబూబ్ సుభాని దర్గా వరకు ర్యాలీగా వెళ్లి ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ కరీం అష్రఫీ, మహ్మద్ సర్తజ్ హుస్సేన్, మిర్జా నిసారా ఉల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం నాయకులు





18 మందికి.. ఒకటే మరుగుదొడ్డి!

- గురుకులంలో లోపించిన పారిశుద్ధ్యం
- ఆందోళనలో విద్యార్థులు

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పారిశుద్ధ్యం లోపించింది. 550 మంది విద్యార్థులు ఉంటున్న పాఠశాలలో 30 మరుగు దొడ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. అంటే దాదాపు 18 మంది విద్యార్థులకు ఒకటే మరుగుదొడ్డి ఉంది. వాటిని కూడా శుభ్రం చేయడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి టెండర్లు తీసుకున్న వారి నిర్లక్ష్యం కారణంగానే అపరిశుభ్రత నెలకొందని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న వేళ వ్యక్తిగత అవసరాల కోసం బహిర్భూమికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. రాత్రి వేళల్లో విష సర్పాలు కాటు వేస్తే తమ పరిస్థితి ఏంటని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకుల పాఠశాల పేరెంట్ కమిటీ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. బాత్ రూమ్‌లలో నీళ్లు లేవన్నారు. తాగడానికి మంచి నీరు కూడా నీళ్లు లేవు. బహిర్భూమికి బయటకు వెళ్తున్నారు. రాత్రిపూట వాటర్ ట్యాంక్ దగ్గరకు వెళ్లి బకెట్లలో నీటిని తీసుకెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారని వాపోయారు. దీనిపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదన్నారు. డార్మెటరీ, తరగతి గదుల్లో ఊడవడం లేదు. పిల్లలే చీపురు కట్టలు తీసుకొని శుభ్రం చేసుకుంటున్నారని ఆరోపించారు.

చెరువు దారికి మరమ్మతులు

దోమ: రైతులు పొలాలకు వెళ్లే దారులతో ఇబ్బందులు పడకుండా ముందస్తూ చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో చెరువుకు వెళ్లే దారిని జేసీబీతో శుభ్రం చేయించారు. గ్రామంలో పరిశుభ్రతతో పాటు రైతులు పొలాలకు వెళ్లే ప్రాంతాలను సైతం ఇబ్బందులకు లేకుండా చూస్తున్నామని ఆయన చెప్పారు. మొచ్చి మొక్కలు, ముళ్ల కంచెలు తొలగించినట్లు తెలిపారు.

మూలనపడ్డ చెత్త రిక్షాలు



బోయినగడ్డ తండాలో వృథాగా చెత్త రిక్షా

దుద్యాల్: గ్రామంలో నిల్వ ఉన్న చెత్త చెదారాన్ని డంపింగ్‌యార్డుకు తరలించే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ సిబ్బందికి గతంలో రిక్షాలు అందించారు. ప్రస్తుతం వాటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. మండల పరిధిలోని సాగరం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోయిన గడ్డ తండా, గౌరారం గ్రామాల్లో రిక్షాలు మూలన పడ్డాయి. మండలంలోని చాలా గ్రామాల్లో కూడా చెత్త బండ్ల పరిస్థితి ఇలానే ఉంది. ఈ రిక్షాలను వినియోగంలోకి తేవాలని మండలవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్యాస్ ప్రొసీడింగ్స్ అందజేత



గ్యాస్ సబ్సిడీ ధ్రువపత్రాలు అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: బడుగు బలహీనవర్గాల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని చాపలగూడెం గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక నాయకుడు కుమ్మరి స్వామి ఆధ్వర్యంలో గ్యాస్ సబ్సిడీ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు జంగయ్య, వెంకటయ్య, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ టు వికారాబాద్

బొంరాస్‌పేట: కొడంగల్ నుంచి జిల్లా కేంద్రం వికారాబాద్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం ఎంతో ఉపయోగకరమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి డిపో నుంచి బస్సు సౌకర్యాన్ని మండల కేంద్రంలో ఆయన ప్రారంభించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

కుల్కచర్ల: మండల పరిధిలోని చిన్న అంతారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం గ్రామస్తులు సమక్షంలో అత్యంత భక్తిప్రపత్తులతో ఆధ్యాత్మికత శోభా విరిసేలా హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేశారు.



మహిళా సంఘాల బలోపేతానికి కృషి

ఎంపీడీఓ రాములు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బంట్వారం: మహిళా సంఘాలు మరింతగా బలోపేతమై ఆర్థికంగా ప్రగతి సాధించాలని ఎంపీడీఓ రాములు అన్నారు. శుక్రవారం మహిళా సమాఖ్య వార్షిక సర్వసభ్య సమావేశం ఐకేపీ ఏపీఎం దేవయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న బ్యాంకు రుణాలను దుబారా చేయకుండా స్వయం ఉపాధిని పెంపొందించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అంతకుముందు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా సంఘాలు సాధించిన ప్రగతిపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, ఎంపీఓ నాగరాజు, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, ఈజీఎస్ ఏపీఓ సుధాకర్, సీసీలు ప్రకాష్‌గౌడ్, అనుసూజ, లక్ష్మయ్య, నర్సింలు, అరుణ్, సీఓ గోపాల్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



గౌతపూర్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు రూరల్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో బీజేపీ సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. వచ్చే సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ తరఫున అభ్యర్థులను పోటీలో నిలిపి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ ముదిరాజ్, బొప్పి శ్రీహరి, శాంతుకుమార్, ప్రభుశంకర్, మల్లికార్జున్, శ్రీకాంత్, సాయిలు, భద్రేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, లక్ష్మప్ప, నరేష్, వెంకట్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.



గుంతల రోడ్డు.. ప్రయాణానికి పాట్లు

నవాబుపేట: నిత్యం వందలాది వాహనాలతో కిటకిటలాడే మండల కేంద్రం అస్తవ్యస్తమైన రోడ్డుతో సమస్యలు సృష్టిస్తోంది. నవాబుపేట మీదుగా వికారాబాద్–శంకర్‌పల్లి వెళ్లే ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఎదురవుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇదివరకే ఉన్న గుంతలు మరింత పెద్దగా మారాయి. ఈ రోడ్డుపై నిత్యం ఆర్టీసీ బస్సులు, మైనింగ్ లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన మార్గంలో పెద్ద గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

యాలాల: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పాండుగౌడ్ కుటుంబాన్ని శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పాండుగౌడ్ తల్లి ఇటీవల మృతి చెందింది. ఈ విషయమై మహేందర్‌రెడ్డి మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ కరణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శివకుమార్, భీమప్పలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అండగా ఉంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, రాములు, రాజు, భాస్కరాచారి, జీపీ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంతో మేలు



మందులు అందజేస్తున్న నర్సింలు

పెద్దేముల్: మండలంలోని తట్టెపల్లిలో ఎల్ఎస్ఆర్ యువసేన సహకారంతో మహవీర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సింలు శుక్రవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు శిబిరంలో పరీక్షలు చేయించుకొని మందులు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, శంకర్, నర్సిములు, అంజప్ప, మహేశ్, బంద్యప్ప, రాములు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్లో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సెల్ ఫోన్ వాడకంతో జరిగే పరిణామాలపై పోటీలు నిర్వహించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథస్వామి ఉత్సవాలు

పూడూరు: మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో కొలువుదీరిన తిరుమలనాథస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం అంతా తిరుమలనాథుని సంకీర్తనలతో మార్మోగాయి. అనంతరం స్వామివారి ఏకాంతసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, నాయకులు సురేందర్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాష్, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.